


# సర్పశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

ఇప్పటి వరకూ జరిగిన కథ

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్పశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

"**మనం వేచి ఉందాం.** అవకాశం వస్తే ఆపదలో చిక్కుకున్నవారిని మనసారా ఆదుకుందాం. వారికి చెయ్యాల్సిన సర్వసహాయాలూ చేద్దాం. మనతో పనిచెయ్యడానికి ఇష్టపడే వారికే విషయాన్ని విపులంగా చెప్పి ఇది ప్రకృతి సంబంధమైన ఆపదలా, మానవ ప్రయత్న ఫలితాలా అనేది స్పష్టంగా చర్చించి, విద్రోహులు హత్యకి పాల్పడితే వారిని పట్టించేపనో, ఆచూకీ పట్టే పనో, ఆకరికి తుదముట్టించే పనో చేద్దాం. ఈ కార్యక్రమంలో మనం త్రికరణ శుద్ధిగా ఆచరించవలసింది 'వసుధైక కుటుంబం' అన్న మాట యొక్క సారాంశాన్నే!" అన్నారు యజ్ఞప్ప.

రాబీ, జయ్, ప్రవస్థి, రిషీయాదవ్, మహమ్మద్ అతీం, నరోత్తం ఝా, దద్లానీ, స్టిట్సన్, డాంటే, రజోవ్‌స్కీ, భట్టాచార్య, శ్రీనివాస్, మూంజీవాన్, మహాదేవన్ గౌరీదేవి, డాక్టర్, రామజోగి, మట్టూ, శృంగీ, శాస్త్రిగారు మదాలస అందరూ శ్రద్ధగా వింటున్నారు.

"మరో మార్గం కూడా ఏదీలేదు అన్నది శరద్వతి.

"రాబోయేదో, సృష్టింపబడబోతున్నదో, ఓ మహాప్రళయం అంటున్నారు. మనం పాతికమందిమికూడా లేము. ఏం చెయ్యగలం? చికాగ్గా అన్నాడు రాబీ.

"బాబూ వంద ఎకరాలు ఆక్రమించిన మహా మర్రి వృక్షం కూడా పుట్టేది ఓ చిన్న ఆవగింజంత ఉండే విత్తనం నించే" చిన్నగా నవ్వి అన్నారు పరమేశ్వర శాస్త్రి.

"మీ భారతీయుల పాజిటివ్ థింకింగే ఎప్పుడూ నన్ను సంభ్రమాశ్చర్యాలకి గురిచేస్తుంది. రియల్లీ గ్రేట్" మెచ్చుకుంటూ అన్నాడు ఎడ్వర్ట్ డాంటే.

"యస్ బ్రదర్" అన్నాడు స్టీట్సన్.

"అది మా పూర్వీకులు మా కిచ్చిన వరం" అన్నాడు శ్రీనివాస్.

"ఇది కేవలం నమ్మకానికో, ఆశావాదానికో గుర్తుకాదు. మనిషి శరీరం శాశ్వతం కాదు. కానీ ఆత్మ శాశ్వతం. అందుకే ఆత్మ శరీరాన్ని మార్చుకుంటుంది. ఓ మహాద్భుత చైతన్య శక్తే యీ సృష్టి. చిరిగిపోయిన బట్టలని మనం మార్చుకున్నట్లు, చితికిపోయిన శరీరాన్ని ఆత్మ మార్చుకున్నట్టూ, ధ్వంసమైన ప్రకృతిని ఆ మహా చైత్యన్య శక్తి మార్చుకుంటుంది. అదే ప్రకృతి ద్వారా సృష్టింపబడే ప్రళయాలు. సముద్రంలోపల పర్వతాలు ఉన్నాయి. అగ్నిపర్వతాలు ఉన్నాయి. మైదానాలు ఉన్నాయి. లోయలున్నాయి. మనం ఊహించనుకూడా ఊహించలేని శిధిల నగరాలున్నాయి. ఏనుగులకంటే వెయ్యిరెట్లు బలం కలిగిన జలచరాలు భూమిలోపలి పొరల్లో ఉన్నాయి. అన్నీ మనం సృష్టించిన శాటిలైట్స్‌కి అందుతాయని భ్రమలో మనం ఉన్నాం. ఎంత పిచ్చివాళ్ళం. మనిషి సృష్టించే విజ్ఞానమంతా మానవత నిర్మాణానికి కాక, విధ్వంసం వైపు పయనిస్తోంది. అందుకే, ప్రకృతి కోపం ప్రకోపించకముందే మన ధృక్పధం మారాలి. ప్రకృతిని రక్షించుకోవాలి. తత్కాల సుఖాలకు చెల్లుచీటీ రాసి, శాశ్వతమైన, నిర్మాణాత్మకమైన బాటలో నడవాలి."

సుదీర్ఘంగా, ఓ ఉపన్యాసంలా మాట్లాడాడు రామజోగి.

అంతా శ్రద్ధగా విన్నారు. ఎవరూ జవాబు చెప్పలేదు. చెప్పటానికి ఏముందీ?

"ప్రజల భావాల్నీ ప్రవర్తననీ నిర్దేశించవలసిన ప్రభుత్వాలే ప్రజలని దుర్వ్యసనాల బారిపడేట్టు చేస్తుంటే, సన్మార్గం వైపు నడిపించేది ఎవరూ? ఎక్కడ బడితే అక్కడ వైన్ షాపులు, ఎక్కడబడితే అక్కడ రేసులూ, జూదాలూ మనసుల్ని సర్వనాశనం చేస్తున్న వేలాది ఛానల్సు. సిగరెట్లు, మద్యం ఆరోగ్యానికి హానికరం అని పేకెట్ల మీదా, సీసాలమీదా ప్రచురించే ప్రభుత్వమే, వాటి పునాదులమీద అంతులేని సంపదని ఆర్జిస్తున్నది. కులం, మతం అనేవి మనిషికి శ్వాసలుగా మారాయి. అన్ని సంక్షేమ పథకాలూ 'ఓట్ల'కోసమే. నదీనాం సాగరోగతిః అన్నట్టు అన్ని పార్టీల ఆలోచనలూ పయనించేది ఓటు సముద్రం వైపే" తీవ్రమైన స్వరంతో అన్నాడు శ్రీనివాస్. చిన్నగా తలపంకించింది శరద్వతి.

"నిజమే.. అన్ని అవలక్షణాలనూ రూపుమాపాలంటే కావలసినది సరైన నాయకత్వం. ప్రభుత్వాధికారులూ, మంత్రులూ వారి అనుచరగణాలు. ఎప్పుడైతే తాము ఉన్నది ప్రజలకోసమనీ, ప్రజాసేవ తమ ధర్మమనీ మరచిపోయి ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తారో, ఆ క్షణం నించే పతనం ప్రారంభమౌతుంది. ఆ పతనాన్ని ఆపాలంటే సరైన, మెరుగైన పర్యావరణానికీ, మేధస్సుకీ మేలు కలిగించే విద్యని అందించినప్పుడే ప్రగతిని సాధించే దారి మనకు దర్శనమిస్తుంది" అన్నది శరద్వతి.

"నిజం శరద్వతీ.. ప్రజల్లోనూ ప్రభుత్వాలలోనూ మంచి మార్పుకలగాలని ప్రార్దిద్దాం" శరద్వతిని చూస్తూ అంది మదాలస.

"మనని మనం మార్చుకోవాలి. ప్రార్ధన ఎందుకూ? మనం చేసే తప్పులు మనకి తెలీవా? మనుషుల్ని మతాలుగా, కులాలుగా వర్ణాలుగా, వర్గాలుగా, పేద, ధనిక, మధ్యతరగతులుగా విభజించింది ఎవరూ? ఎందుకూ? సత్ప్రవర్తన కోసం మనమే మతాన్ని సృష్టించుకుని 'మతక్రమశిక్షణ' అలవరచుకున్నాం. మనిషి చనిపోయినా అతని అనుభవం గాలిలో కలసిపోకూడదని 'కులాన్ని' వృత్తుల పునాదుల మీద నిర్మించాం. అనుభవాల్ని తరతరాలకూ అందించడమేకాక, నిరుద్యోగ సమస్యని ఆనాడు పటాపంచలు చేశాం.

'డబ్బు' సృష్టి జరగనంతకాలం కులాల మధ్య నేను గొప్ప, మా కులం గొప్ప అనే కీచులాటలు లేవు. అందరికీ అందరితో పని ఉండేది గనక మానవ సమాజం అద్భుతంగా వర్ధిల్లింది. ఆ తరవాత 'డబ్బు' కి ప్రాముఖ్యత పెరిగింది. ధనం ఉన్నవాడే జన్మాల్ని కొనగలడు. ఏ పనీ రాని ఏబ్రాసి అయినా ధనం ఉంటే చాలు.. అన్నిట్నీ కొనగలడు. అందర్నీ భయపెట్టగలడు అనేది నిర్వివాదాంశంగా మారింది. సంపాదన మీద తప్ప జీవితం మీదా, జీవన సంతోషం మీదా మనిషి దృష్టి పెట్టడం మరిచిపోయాడు. మనుషులేం, దేశాలే మర్చిపోయాయి. రక్షణ కోసం అణ్వాస్త్రాల గుట్టలు పేరుస్తున్నాయి"అన్నాడు శమంతో.

"అయ్యో సృష్టించేదీ మనమే.. ధ్వంసం చేసేదీ మనమే.. ఇంత స్వార్ధం, ఇంత భోగలాలస ఉన్నజీవి మనిషి ఒక్కటే. ఏ జీవీ మనిషి చేసినంత అపకారం ప్రకృతికి చెయ్యదు. నిజంగా ఆలోచించండి.. ఒకప్పుడు పళ్ళూ, కందమూలాలూ తిని బ్రతికిన మనిషి 'పండించడం' నేర్చుకున్నాడు. ధాన్యపు రాశుల్ని 'అమ్మటమూ' నేర్చుకున్నాడు. ఒక్కసారి అమ్మడం కొనడం ప్రారంభమయ్యాక తన వలలో తనే చిక్కాడు. అంతేకాదు ప్రకృతినీ, ప్రకృతిలోని సమస్తాన్నీ కూడా వ్యాపార వస్తువుల్ని చేశాడు. 'మనీ' కోసం మనశ్శాంతిని పోగొట్టుకున్నాడు.

ఓ మనిషికి జీవితకాలానికి సరిపడా ఎంత ధాన్యం, ఎన్ని బట్టలు కావాలీ, ట్రాక్టర్లు వచ్చాయి. మనుషుల పనిగంటలు తగ్గించి సోమరిపోతుల్ని చేశాయి. బట్టల మిల్లులొచ్చి నేతగాళ్ళ పొట్టలు కొడితే, బాటాలు వచ్చి చర్మకారుల్ని చంపేశాయి. లోహకారుల సంగతీ, స్వర్ణకారుల సంగతి కూడా అలాగే అయింది. మెషిన్లు కావాలి. కానీ ఎవరికీ? మహాత్మాగాంధీలాంటి వారు యీ పరిస్తితుల్ని ముందే ఊహించి గృహపరిశ్రమలకీ, చిన్న పరిశ్రమలకీ ఊతమిచ్చి, భారీ పరిశ్రమలను దూరం పెట్టమన్నారు. విన్నదెవరూ? రైతుల జీవితాలు పురుగు మందుల పాలవుతున్నాయి. పేదల బతుకులు నానాటికీ క్షీణించిపోతున్నాయి. మనిషి 'బుద్ధిజీవి' అని మనమే గొప్పగా చెప్పుకుంటాం. మరి 'బుద్ధి'తో మనిషి సాధించింది ఏమిటీ?" బాధగా, నిర్లిప్తతతో అన్నాడు గోర్కి.

"యస్ మనం ప్రగతి అనుకుంటున్నదంతా ప్రగతి కానేకాదు. తిరోగమనం మాత్రమే. ఇలా కావడానికి మేమూ ఓ కారణమే. మీ ఇండియాకి వచ్చి మా పద్ధతుల్ని మీమీద రుద్దడం మా తప్పే" అన్నాడు ఎడ్వర్డ్ డాంటే.

"నేనూ నీ మాటలు కరెక్ట్ అంటాను" అన్నాడు స్టిట్సన్.

"అన్యాయం, అరాచకం మహా సనాతనం. మీవల్లో మరొకరివల్లో వచ్చింది కాదు. యావత్ ప్రపంచమూ 'ధనం' అనే ఒక్క శక్తి చుట్టూ తిరుగుతోంది. అది ఎంత శిష్ట శక్తో అంత దుష్టశక్తి. మనం దానిని విధ్వంసం వైపే మళ్ళిస్తున్నాంకానీ, మంచివైపుకాదు" అన్నాడు రామజోగి.

"మనం ఎంత ముందుకు వచ్చామంటే, వెనక్కి తిరిగిపోలేనంతగా! ప్రళయాలూ అవీ పుట్టేది ఇటువంటి సమయాల్లోనే. మనం చేసిన గాయాలకు ప్రకృతి తన మందు తనే వేసుకోవాలిగా!" అన్నాడు మహమ్మద్ అతీం.

"అవును. ప్రతీ వృక్షం తన ఆకుల్ని తనే రాల్చేసుకుని కొత్త చివుళ్ళు తొడుక్కుంటుంది. అలాగే, తీవ్రపరిణాలకు లోనైనప్పుడు పత్రాల్ని వృక్షం రాల్చేసినట్లు ప్రక్రుతి తన రుగ్మతను విదుల్చుకుని పునః యవ్వనాన్ని పొందుతుంది. ఎవరో గొప్పవాడు అన్నాడు 'వృద్ధాప్యానికి మూలం బాల్యం, బాల్యానికి మూలం వృద్ధాప్యం (లో.. మృత్యువు) అని. అలాగే ఓ వినాశనం ఒక నూతన సృష్టికి నాందిగా మారుతుంది" చిన్నగా అన్నారు పరమేశ్వర శాస్త్రిగారు.

సుదీర్ఘంగా నిట్టూర్చాడు జయ్.

"జయ్.. నీ నిట్టూర్పుకి అర్ధం నాకు అర్ధమయింది. మనం దారితప్పిన బాటసారుల్లా ఇక్కడ ఉన్నాం. మనం ఏ పనిని స్వీకరించామంటే, దానికి ఆదీ అంతమూ లేదు. కనీసం ఆ చెయ్యవలసిన పని యొక్క పరిమాణం కూడా మనకి తెలీదు. పులి కోసం వేటాడే వేటగాళ్ళలా, శత్రువుల కదలికలు అనుక్షణం కనిపెట్టే రెప్పవాల్చని సైనికుల్లా మనం ఉండాలి.

యుద్ధపు ఛాయల్నీ, పులి జాడల్నీ వేటగాళ్ళూ, సైనికులూ ఎలా గుర్తిస్తారో, అలాగే జరుగుతున్న సంఘటనల యొక్క గూఢమైన లక్ష్యాన్ని మనం గుర్తించాలి" అన్నాడు సచేత్ దద్లానీ.

ఓ ట్రైన్‌లోని కంపార్ట్‌మెంట్ అంతా మహా కన్యాదేవికీ ఆమె శిష్యులకీ బుక్ చేశారు. ఆల్‌హసన్ హుంజా మీర్. ఢిల్లీనించి వారి ట్రైన్ బయలుదేరింది. ఆల్‌హసన్ కోరిక మీర మహా కన్యాదేవి, మహామాయ, హనుమంతు అందరూ పురానా ఢిల్లీలోని 'షౌకత్' భవనానికి వెళ్ళారు. అక్కడ జరిగిన భీభత్సాన్నే కాక 'షగున్'ని కూడా చూశారు. ఆ పిల్లవాడు మహాకన్యాదేవి వంక చూస్తూ నవ్వడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. నవ్వడం మాత్రమేకాదు... ఎత్తుకోమన్నట్టు చేతులుకూడా జాపాడు. మహామాయ ఎత్తుకుంది. మహామాయ ఎత్తుకోగానే కోపంగా చూశాడు.

"నెల బిడ్డకి ఆనందం, క్రోధం వంటి భావాలు ఎలా కలుగుతాయి? ఏ భావాలూ వారిలో ఉండవు కదా?" ట్రైన్‌లోకి ఎక్కాక ఆశ్చర్యంగా అన్నది మహామాయ.

"ఆ భావాలూ భావప్రకటనలు అన్నీ గత జన్మకి సంబంధించినవి మాయా. పుట్టిన పిల్లలు రోజు కూడా గడవకముందే నిద్రలో భయపడి కెవ్వుమని ఏడుస్తారు. నవ్వుతారు. అంటే? గత జన్మల తాలూకు ఆలోచనలు వారిలో ఉన్నట్లే కదా. లేకపోతే నవ్వూ, భయం ఎందుకు వస్తుందీ?" చిన్నగా అన్నది మహా కన్యాదేవి. ఏనాడూ పిల్లల్ని ఎత్తుకోని మహాకన్యాదేవి పిల్లల గురించి ఇంత విపులంగా చెప్పడం మహామాయని ఆశ్చర్యానికి గురిచేసింది. కానీ మహా కన్యాదేవిని అడగలేదు.

"మాయా.. ఆ పిల్లవాడి పేరు ఏదో పెద్ద పేరు. కానీ, కానుపు చేసిన మంత్రసాని 'షగున్' అంటే శకునం శకుని అనిపిలిచిందిట. ఆ మాట మాత్రం నిజం. అతని నుదురు తెలివితేటలకి ఆలవాలంగా కనిపిస్తే, అతడి చేతుల్లో మహాద్భుత రేఖలున్నాయి. ఆనాటి, ఆ మహాభారత కాలంనాటి శకునిలా వినాశనానికీ, విధ్వంసానికీ కారణమౌతాడో, లేక ధర్మాన్ని నిలబెట్టడానికి కృషి చేస్తాడో భగవంతుడే నిర్ణయించాలి" అన్నది మహా కన్యాదేవి.

"ఒక్క క్షణంలో...." ఆగిపోయాడు హనుమంతు.

"చూసిన క్షణంలోనే చెట్టుకి ఎన్నికాయలో లెక్కబెట్టగల నేర్పరివి.. నీకా సందేహం" నవ్వింది మహాకన్యాదేవి. హనుమంతుతో సరదాగా మాట్లాడడం ఇదే మొదటిసారి. సిగ్గుపడుతూ తల దించుకున్నాడు హనుమంతు.

"అమ్మా యీ విధ్వంసాలకు హద్దేలేదా?" అడిగింది ఓ బ్రహ్మచారిణి.

"సృష్టిలో ఏది జరిగినా ఎలా జరిగినా అది భగవత్సంకల్పమనే మనం భావించాలి. అన్నీ మన చేతుల్లోనే ఉంటాయని మనం విర్రవీగుతాం. కానీ ఏదీ నీ చేతిలో లేదు. ఆఖరికి నువ్వు శ్వాసించే ఒక్క శ్వాసకూడా నీ చేతిలో లేదు. కర్త ఎవరు? కర్మ ఎవరిదీ? ఈ ప్రశ్నలకు సమాధానం జవాబుల్లోంచి రాదు. అనుభవంలోనించి వస్తుంది. అందుకే శ్రీ కృష్ణులవారు 'కర్మణ్యేవాధికారస్తే మాఫలేషు కదాచన' అన్న శ్లోకం అర్జునుడికి బోధించింది.

ట్రైను లయబద్ధంగా పరిగెడుతోంది. హనుమంతుకి ఇంకా షౌకత్, షౌకత్‌లోని షగున్, ఆ పరిసరాలే గుర్తుకొస్తున్నాయి. నిరాశ్రయులైన బాధ అతని చిన్న మనసుని పిండేస్తోంది. షౌకత్‌లో లక్ష్మీదేవి తాండవం చేస్తే ఆ భవనం పరిసరాల్లో ఇనుపగజ్జల తల్లి విలయ తాండవం. మహామాయి సైగతో ఇద్దరు బ్రహ్మచారిణులు అందరికీ శుభ్రమైన పళ్ళ ముక్కల్ని పంచారు. ఆల్‌హసన్ బుట్టల కొద్దీ పళ్ళు రైల్లో పెట్టించాడు. చపాతీలాంటి తినుబండారాలని వద్దని చెప్పింది మహామాయి.

"అమ్మా అవి మీరు స్వీకరించరని తెలుసు. అందుకే పళ్ళూ, ఖర్జూరాలూ, కిస్‌మిస్, బాదం, పిస్తావంటి అంటులేని డ్రైఫ్రూట్స్‌ని సిద్ధం చేశాను. దయచేసి కాదనకండి. అవన్నీ కాశ్మీరం నుంచి తెప్పించినవే" చాలా గౌరవంగా వినయంగా అన్నాడు ఆల్ హసన్.

దట్టమైన చీకట్లో ప్రయాణిస్తోంది రైలు. హనుమంతుకి నిద్రపట్టలేదు. కిటికీలోంచి బయటికి చూస్తే గుంపులు గుంపులుగా చీకటి తెరలు.

చెన్నైలో దిగి అక్కడినించి తిరువణ్ణామలైకి పోవాలి. ఆ తరవాత కంచిలో ఏకాంబరేశ్వర కామాక్షీ అమ్మవార్ల దర్శనం, ఉళగనాథర్ స్వామి (వామనావతారం) దర్శించుకోవాలని మహామాయ చెప్పడం హనుమంతుకి గుర్తున్నది. ఈ దివ్యక్షేత్రాల్లో ఏముందో తెలీదు... కానీ క్షిప్రానది, మహా కాళేశ్వరస్వామి హనుమంతు మనసుని వదిలి పెట్టడంలేదు.

మహామాయ, మహాకన్యాదేవి కూడా నిద్రపోవడంలేదు.

"అమ్మా" అన్నాడు హనుమంతు మహామాయని చూసి.

"ఊ.. ఏంకావాలీ?" అన్నది మహామాయ.

"అమ్మా.. ఉస్రా నది ఒడ్డున వేలకొద్దీ కంకాళాలు భూగర్భంలో ఉన్నాయన్నారు కదా.." ఆగాడు హనుమంతు.

మహాకన్యాదేవి ఆ మాటలు విన్నది. ఆమెకీ గుర్తొచ్చింది. వేలాది కంకాళాలనీ, చిత్రమైన భారీ జీవుల్నీ భూగర్భంలో చూడటం. ఒక్కసారి ఒళ్ళు ఒణికింది.

"అటువంటివి తలచుకోకూడదు హనుమంతూ" మహాకన్యాదేవి ఒణకడం చూసి అంది మహామాయ.

"నాకూ గుర్తుతెచ్చుకోవాలని లేదు. కానీ అమ్మా, ఆ దృశ్యాలు, మహా కాళేశ్వరుడు అక్కడ మనని కలిసిన సన్యాసులూ అందరూ గుర్తొస్తున్నారు. అమ్మా.. ఇంకో విషయం చెప్పనా? షగున్, అదే శకుని కళ్ళు చాలా విచిత్రంగా ఉంటాయి కదూ. ఆ చూపుల్లో చాలా తీవ్రత ఉంది. నోరు విప్పకుండానే ఏదో చెపుతున్నట్టు అనిపించింది. ఆల్ హసన్‌గారి భార్యపేరు మీరా అట. అంటే హిందూ అన్నమాట" ఏదేదో మాట్లాడుతున్నాడు హనుమంతు.

"హనుమంతూ అమ్మవారిని మనసులో తలచుకుని హాయిగా నిద్రపో" మెల్లగా అన్నది మహామాయ.

రైలు ఒక లయలో సాగుతోంది. అందరూ నిద్రలోకి జారుతున్న వేళ –

కాలనేమి, (కామేశ్వర శర్మ) ముందున్న విగ్రహం ముక్కలు ముక్కలుగా పేలిపోయింది. పింగళుడు, కర్కోటకుడు నిశ్చేష్టులయారు.

"ఏదో ప్రయోగం జరిగింది పింగళా" నిస్సత్తువగా అన్నాడు కర్కోటకుడు. శిష్యులందరూ చేష్టలుడిగి చూస్తున్నారు.

"మనం ఇక్కడ పూజచేస్తున్నామని ఎవరికి తెలుసూ?" అయోమయంగా అన్నాడు పింగళుడు.

"ఏదేమయినా చివరి క్షణంలో పూజ భగ్నమయింది. మరో మూడేళ్ళవరకూ మనమేమీ చేయలేం" నిస్సత్తువగా నేలమీద కూర్చున్నాడు కర్కోటకుడు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments